క్లుప్తంగా

గేర హానోక్‌కు మల్లాది విష్ణు అభినందనలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గేర హనోక్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు అభినందించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని విష్ణు కార్యాలయానికి హానోక్ గురువారం విచ్చేసి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనోక్‌ను మల్లాది విష్ణు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. క్రిస్టియన్ మైనార్టీల హక్కుల సాధన కోసం పాటుపడే హనోక్‌కు ఇంతటి మంచి బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, ఆయనకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

ఎస్ఆర్ఆర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, పివి సిద్ధార్థ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల, నలంద కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సుధా మధురం గాన సమ్మోహనం



విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని మరకత రాజ రాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీత ఉత్సవాలు గురువారం ముగిసాయి. రాంపల్లి గోపీ కృష్ణ త్యాగరాజ స్వామి సంగీత సాహిత్యంలో భక్తి అంశంగా ప్రసంగించారు. చివరిగా టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. నాదం శంకరం, శోభిల్లు సప్తస్వర, త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, ఘటంపై హరిబాబు, మృదంగంపై ఎంఎస్ కల్యాణరామన్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక సంఘం సభ్యుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామశాస్త్రి, గోపీ కృష్ణశర్మ, కీర్తి చంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ గడువు 31 వరకు పొడిగింపు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరిపేటలోని వివిధ కాలనీల్లో దీర్ఘకాలికంగా నివాసం ఉంటున్న వారి నివాసాలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను 31వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరి పేట లో 10 సంవత్సరాలు కంటే ఎక్కువగా నివసిస్తున్న వాళ్లు, విజయవాడ నగర పాలక సంస్థ వారు జారీ చేసిన పట్టా ఇంకా రిజిస్ట్రేషన్ కానీ వాళ్ల గజం కేవలం రూ.100 రూపాయలకే రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో పాయకాపురం కాలనీలు, కొత్త రాజరాజేశ్వరి పేట ప్రాంతాల వారికి విడివిడిగా రిజిస్ట్రేషన్ చేసేలా సౌకర్యాలు కల్పించామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తమతో పాటు ఇంటి పట్టా, లింక్ డాక్యుమెంట్స్, యజమాని ఆధార్ కార్డ్, ఇంటి పన్ను రసీదు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులతో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయగలరని సూచించారు.

రైతు బజారుల్లో దళారుల దోపిడీ

- ప్రజాప్రతినిధులకు నెలవారీ మామూళ్లు
- ధర నిర్ణయించేది దళారులే
- కనిపించని రైతులు



సాంబమూర్తి రోడ్డులోని రైతు బజార్



రైతుబజారులో దుకాణాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'రైతు బజార్‌లో షాపు కేటాయిస్తే రూ. 10 లక్షలు ఇస్తా' ఇది రైతు బజారులో దళారి నగరంలోని ఓ ప్రజా ప్రతినిధికి ఇచ్చిన ఆఫర్. ఇంత పెద్ద ఆఫర్ ఇచ్చాడంటే రైతు బజారుల్లో దళారులు ఏ విధంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, రైతులు పండించిన కూరగాయలకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన రైతు బజారుల్లో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. అధికారపార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు రైతు బజారుల్లో తిష్టవేశారు. ఈఓ, సూపర్‌వైజర్లను చెప్పుచేతల్లో పెట్టుకుని పెత్తనం సాగిస్తున్నారు. షాపుల లాటరీ దగ్గర నుంచి కూరగాయల ధర నిర్ణయం వరకు వారిదే హవా. టమోటా, పచ్చిమిర్చి ఇలా కూరగాయలు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వారే రైతు బజారుల్లోని షాపులకు విక్రయిస్తున్నారు. ఇలా దోపిడీకి తెరతీశారు. దోచుకున్న దాన్లో కొంత భాగం నెల నెలా ప్రజా ప్రతినిధులకు ముట్ట జెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ఈ దందా కొనసాగుతోంది. ఈ దందాపై గతేడాది నవంబర్ చివర్లో జరిగిన డీఆర్‌సీ మీటింగ్‌లో పెద్ద చర్చ జరిగింది.

ఎన్టీఆర్ జిల్లాలో...

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 15 రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో రూరల్‌లో 6, విజయవాడ అర్బన్‌లో 9 రైతు బజార్లు ఉన్నాయి. మొత్తం 1113 స్టాల్స్ ఉండగా వీటిలో అద్దె షాపులు 439, రైతుల షాపులు 535 ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 139 స్టాల్స్ ఇంకా ఖాళీగా ఉన్నాయి. నగరంలోని అజిత్‌సింగ్, పాయకాపురం, కేదారేశ్వరపేట, భవానీపురం, కృష్ణలంక, సాంబమూర్తి రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ, పటమట ప్రాంతాల్లో రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో భవానీపురంలో 23, ఇబ్రహీంపట్నంలో 20, మైలవరంలో 6, నందిగామ, కంచికచర్ల లో రెండేసి చొప్పున , తిరువూరు, కృష్ణలంకలో 10 , జీఎల్ రాజు రోడ్డులో అత్యధికంగా 60 షాపులు, ఏపీఐఐసీ కాలనీలో 6 షాపులు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా షాపులు నిర్వహిస్తున్న వారిని బెదిరించి వారి వద్ద నుంచి లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం. అలాగే ఖాళీగా ఉన్న షాపుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయి. ఇప్పటికే రైతు బజారుల్లో పెత్తనం చేస్తున్న దళారులు ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో ముట్టజెప్పి షాపులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఒక్కో రైతు బజారు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు నెలకు రూ. 3 నుంచి 5 లక్షల వరకు మామూళ్లు వెళుతున్నట్లు సమాచారం. రైతు బజారుల్లో మామూళ్ల వ్యవహారంలో ఎంపీకి, ఓ మహిళా ప్రజా ప్రతినిధికి మధ్య వివాదం జరిగింది.

ఈఓ కార్యాలయాల్లోనే దళారులు తిష్ట

నందిగామ రైతు బజారులో బీజేపీ నాయకుడు పెత్తనం సాగిస్తున్నారు. షాపుల నిర్వాహకులు అతని వద్దే టమోట కొనుగోలు చేయాలని అనధికార ఆదేశాలు జారీ చేశారు. కంచికచర్ల రైతు బజారుల్లో అధికార టీడీపీ నేతలదే హవా. ఇక్కడ బోర్డు రేటు ఒకటుంటే మరో ధరకు విక్రయిస్తున్నారు. భవానీపురం రైతు బజారులో కూటమి నాయకుడు ఒకరు ఈవో కార్యాలయంలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నాడు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని రైతు బజార్లలో ప్రజాప్రతినిధి అనుచరులు ఇద్దరు ఏకంగా ఈవో కార్యాలయంలోనే తిష్టవేసి దోపిడీకి తెరతీశారు. వీరు రైతుల నుంచి తక్కువ ధరకు కూరగాయలు కొనుగోలు చేసి షాపుల వాళ్లకు విక్రయిస్తుంటారు. ధర నిర్ణయంలోనూ చక్రం తిప్పుతున్నారు. రద్దీగా ఉండే రైతు బజారుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతోనే సిబ్బందికి జీతాలు. దీంతో రైతు బజారుల్లో అవినీతి రాజ్యమేలుతోంది.

అధికంగా వసూలు చేస్తున్నారు



రైతు బజారులో బోర్డు రేటుకు షాపుల నిర్వాహకులు వసూలు చేసే రేటుకు పొంతన ఉండడం లేదు. ఇదేమిటని అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఇష్టమైతే కొనుగోలు చేయ్ లేకపోతే లేదంటూ మాట్లాడుతున్నారు. పిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు.

–జి.శ్రీనివాస్, వినియోగదారుడు

రైతు బజారుల్లో తనిఖీలు

రైతు బజారులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. రైతులు లేదా వాళ్ల ప్రతినిధులు షాపుల్లో ఉంటున్నారో లేదో పరిశీలిస్తున్నాం . నిబంధనల ప్రకారం పారదర్శకంగా షాపులకు లాటరీ తీస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం.

–మంగమ్మ, ఏడీ

ఫిబ్రవరి 1 నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరిలలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. బ్యూటీషియన్ మూడు నెలలు, టైలరింగ్ నాలుగు నెలల పాటు జరిగే ఈ శిక్షణలకు ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గాంధీజీ కాలనీలో అగ్నిప్రమాదం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అగ్నిప్రమాదం జరిగి రూ. 30వేలు విలువైన ఏసీ, డబుల్ కాట్ మంచం, టీవీ కాలి బూడిద అయ్యాయంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీజీకాలనీకు చెందిన కె. విజయ ఖమ్మంలోని తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో చూసేందుకు ఈ నెల 21వ తేదీన వెళ్లారు. 22వ తేదీన విజయ ఇంట్లో మంటలు వస్తున్నాయంటూ ఇంటి పక్కవారు ఫోన్ చేశారు. దీంతో విజయ అక్క కుమారుడు ఎం .ఉపేంద్ర ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు పెరుగుతుండటంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో అగ్ని ప్రమాదం జరగటం అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందని స్థానికులు అంటున్నారు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం సూర్య ఘర్ పథకంతో నూతన వెలుగులు



ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ చైతన్య, పక్కన అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా ప్రతి ఇంట్లో సరికొత్త వెలుగులు నిండుతాయని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన స్కీమ్' పై అజిత్ సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 59వ డివిజన్‌లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సబ్ కలెక్టర్ చైతన్య మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ సిస్టంలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకునే చక్కని అవకాశం కలిగిందన్నారు. ముఖ్యంగా ఈ సోలార్ సిస్టంల ఏర్పాటుకు సంబంధించి పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా 30 వేల నుంచి 80 వేల రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ సిస్టంల ఏర్పాటు చేసుకునే నిరుపేదలకు బ్యాంకుల ద్వారా లోన్లు కూడా అందిస్తున్నారని సూచించారు. సోలార్ సిస్టం ద్వారా మనం వినియోగించే విద్యుత్ బిల్లుల భారం చాలావరకు తగ్గించుకోవడంతో పాటు ప్రకృతి వనరులను కూడా కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకం యొక్క ఉపయోగాలను తప్పకుండా తెలుసుకోవాలని.. ప్రతి ఇంటిపై సోలార్ సిస్టంలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఏపీసీపీడీసీఎల్ డీఈఈ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఒక కిలో వాట్స్ సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ. 50,000 వరకు ఖర్చు అవుతుందని దీనిలో రూ. 30,000 వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. అలానే రెండు కిలో వాట్స్‌కు లక్ష రూపాయలు ఖర్చు అవుతుండగా దానికి రూ. 60,000 రాయితీ, 3 కిలో వాట్స్ అంతకన్నా ఎక్కువ కిలో వాట్స్ తీసుకున్న వారికి 78 వేల రూపాయల వరకు రాయితీలు ఇస్తున్నారని తెలిపారు. నిరుపేద ప్రజలకు ఈ సోలార్ సిస్టంలను ఏర్పాటు చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా బ్యాంకు రుణాలు కూడా అందిస్తున్నారని వివరించారు. అనంతరం సింగ్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం నుంచి అమెరికన్ హాస్పిటల్, డాబా కోట్లు సెంటర్, మాకినేని బసవ పున్నయ్య స్టేడియం మీదుగా 'పీఎం సూర్య ఘర్ ' పథకం ఉపయోగాలు తెలిపేలా ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు వినియోగదారులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సోలార్ సిస్టం యొక్క ఉపయోగాలను వివరించిన కొంతమంది వినియోగదారులను అతిథులు సన్మానించారు. నార్త్ జోన్ తహశీల్దార్ సూర్యారావు, సింగ్ నగర్ ట్రాన్స్‌కో ఏఈ డి. కిరణ్, సచివాలయ, రెవిన్యూ, కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్లు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంలో సోలార్ విద్యుత్‌ను ప్రజలు వినియోగించుకోవాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ సూచించారు. పాయకాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం పట్ల ప్రజలకు అవగాహన కల్పించే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ రామసుందర్, విద్యుత్ సిబ్బంది, సచివాలయాల్లో పనిచేసే వారు సోలార్ విద్యుత్ వినియోగించడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 23వ డివిజన్ పరిధిలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూర్యరావుపేటలో ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి ర్యాలీని ప్రారంభించారు. ఏలూరు రోడ్డు, బీసెంట్, సూర్యారావు పేట పరిసరాల్లో ర్యాలీ జరిగింది. సూర్యఘర్ పథకం ఆవశ్యకతను తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. గృహ సముదాయాలు, దుకాణాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. సోలార్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. స్పెషల్ ఆఫీసర్ మతిన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంటిపై సోలార్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చునని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె గురువారం సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి అవగాహన కలిగించారు. ప్రభుత్వం రాయితీతో సోలార్ రూఫ్‌లు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన సద్వినియోగం చేసుకోవాలని 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు సూచించారు. అయోధ్య నగర్‌లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీ ప్రారంభించారు. పథకం గురించి అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే ఎన్జీఓ సంస్థ పాయకాపురం ప్రాంతంలోని ప్రజలకు ఉచితంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. సెప్టెంబరు నెలలో సంభవించిన వరదల నేపథ్యంలో బోరులు పాడైపోయి నీరు కలుషితం కావడంతో ఆ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడంలో భాగంగా రైతుబజారు ప్రాంగణంలో బోరు ఏర్పాటు చేశామని సంస్థ ప్రతినిధి కె.రాములు తెలిపారు. ప్రతి గంటకు వెయ్యి లీటర్ల తాగునీరు సరఫరా చేసే ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన అనుమతులు ప్రభుత్వం నుంచి తీసుకుంటున్నామని తెలిపారు. వరదల్లో నిరాశ్రయులైన పేద కుటుంబాలకు కూడా తమ సంస్థ తరపున సహాయం అందచేస్తున్నామని పేర్కొన్నారు.

నేతాజీ సేవలు మరువలేనివి



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు తదితరులు



నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ కృష్ణప్రసాద్

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాట సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 27వ డివిజన్ కొత్తవంతెన సమీపంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద గురువారం నేతాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, శర్వాణీమూర్తిలతో కలిసి నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవలను కొనియాడారు. ధైర్యసాహసాలకు, దేశభక్తికి నేతాజీ ప్రతీక అన్నారు. ఆయన నాయకత్వంలో లక్షలాది మంది ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, దేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేసేందుకు.. 'జైహింద్' నినాదంతో యువతను 'ఆజాద్ హింద్ ఫౌజ్' వైపు నడిపిన స్ఫూర్తి ప్రదాత సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. కురిటి శివ, అంజి బాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. నేతాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ కృష్ణప్రసాద్ సూచించారు. స్థానిక కొత్తవంతెన సెంటర్‌లో గురువారం హెల్పింగ్ టు గెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నేతాజీ జయంతి నిర్వహించారు. కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్ అధ్యక్షురాలు కోరంగి నాగమల్లీశ్వరి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. డెప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు, క్యాబినెట్ అధనపు కోశాధికారి బి.వసంతకుమార్, బి.ఆంజనేయరాజు, ఎస్‌కే షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు. ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో రైతుబజార్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ యార్డ్ రోడ్, లూనా సెంటర్, ఎంకే బేగ్ స్కూల్, చల్లగాలి ఐజయ్య రోడ్, లెనిన్ సెంటర్ , రైల్వే ట్రాక్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా చుట్టుగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎస్ఆర్ఆర్ కళాశాల ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట లయన్స్ క్లబ్ రోడ్డు, లయన్స్ క్లబ్ రోడ్డు రామాలయం సమీపంలోని కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ బిల్డింగ్, మారుతీ నగర్, వెంకటేశ్వరావు వీధి, మారుతీ నగర్ ఏలూరు రోడ్డు, మైహోమ్ అపార్ట్‌మెంట్, ఎస్ఆర్ఆర్ కళాశాల ఏరియా, కళాశాల వెనుక కాలువగట్టు ప్రాంతం, పాత మలేరియా ఆఫీసు రడ్డు, హిందీ కళాశాల రోడ్డు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మధురానగర్ సెక్షన్ పరిధిలో........

మధురానగర్ సెక్షన్ పరిదిలో వెంకటేశ్వర నగర్, పప్పుల మిల్లు రైల్వే గేటు ఏరియా, ఉలవచారు కంపెనీ రోడ్డు, తుంగం రాములు స్ట్రీట్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నంంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో.....

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా గాంధీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఏలూరు రోడ్డు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్ రెడ్డి రోడ్డు, గోపువారి వీధి , తాడంకి వారి వీధి . పోలీస్ డార్మెటరీ, మమత హోటల్ రోడ్డు , పాత బస్టాండ్ ఏరియా , ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

దోమలు బాబోయ్ దోమలు



దావు బుచ్చయ్యకాలనీలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం

దోమలకు ఆవాసంగా ఖాళీ స్థలాలు
అల్లాడిపోతున్న నగరవాసులు



ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన గడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసకేంద్రంగా మారాయి. ఒక పక్క బుడమేరు, మరో పక్క ఏలూరు కాలువ, ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. మధురానగర్, జీవీఆర్‌నగర్, భానూనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, రామకృష్ణాపురం , దేవీనగర్, మారుతీనగర్, మాచవరం తదితర ప్రాంతాల్లో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రాత్రి పూట కనీసం కంటినిండా నిద్ర కరువయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. బుడమేరులో దోమల నియంత్రణ చర్యలు చేపట్టినప్పటికీ ఖాళీ స్థలాలను మాత్రం పట్టించుకోవటం లేదు. దీంతో దోమలు పెరిగిపోతున్నాయి. జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్ మధురానగర్, దేవీనగర్ తదితర ప్రాంతాలలో ఖాళీస్థలాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఖాళీస్థలాలలో వర్షపునీటితో పాటు వాడిన మురుగునీరు నిలిచిపోయి దోమలకు ఆవాసకేంద్రంగా మారిందని వాపోతున్నారు. దేవీనగర్, జీవీఆర్ నగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లోని రైల్వే ఖాళీ స్థలాల్లో వర్షపునీరు మురుగునీరు నిలిచిపోవటంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వీటి వల్ల దోమలతో పాటు విషసర్పాల సంచారం అధికం అయింది. రాత్రిపూట ఎటువైపు నుంచి ఏం వస్తాయోనంటూ బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను గురువారం ఆ శాఖ విజయవాడ నోడల్ డివిజన్ జాయింట్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందరూ కష్టపడి పనిచేసి వాణిజ్య పన్నుల శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. తప్పుచేస్తే ఉపేక్షించేది లేదని, అవినీతికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి, గౌరవ అధ్యక్షుడు మురికిపూడి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కెవీఎల్ఎస్‌వి ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సువర్ణరాజు, ఉపాధ్యక్షుడు సాయికిరణ్, డి వెంకటేష్, లక్ష్మయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.